20062025-MAI-06_Layout 1 6/20/2025 1:53 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

రుణవలయంలో మధ్యతరగతి

పైకి ఎగబాకలేక, కిందకు దిగజారలేక నడుమన పడి నలిగేది అనే నిర్వచనం ఇప్పుడు మధ్యతరగతికి సరిపోదు. ఎందుకంటే ఇప్పుడు దేశంలో వినిమయంలో ప్రధాన వాటా ఈ వర్గానిదే. ఆదాయంలో ఎంతోకొంత మిగులు ఉండే వర్గమిది. అయితే ఆ ఆదాయానికి మించిన కోరికల వల్ల విలాస వస్తువులు, విదేశీ విహారాలతోపాటు రియల్ ఎస్టేట్ మోజులో మధ్యతరగతి పరుగులు పెడుతున్నది. దీనికితోడు సులభరుణాలు, క్రెడిట్ కార్డులు కొనుగోళ్ల జోరును పెంచుతున్నాయి. వినోదం, విహారం, సరదా ఆహారం వంటి అత్యవసరం కాని వ్యయాల్లో మధ్యతరగతి వాటా మూడోవంతు దాకా ఉన్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. మొత్తం మీద మధ్యతరగతి వినిమయం పెరిగిందన్నది వాస్తవం. అయితే ఈ వ్యయ విస్తరణలో ఓ సమతూకం, హేతుబద్ధత అనేవి లోపిస్తున్నాయి. పచారీ సరుకుల కొనుగోలులో కనిపించే పొదుపు ఆలోచన కారు కొనుగోలులో కనిపించదు. ఎల్కేజీ సీటన్‌ను పిలిస్తే ఎంత ఖర్చవుతుందోనని మల్లగుల్లాలు పడేవారు విదేశీ ప్రయాణాల విషయంలో మాత్రం ఖర్చుకు వెనుకాడరు. ఆదాయాలు పెద్దగా పెరగకపోయినా సులభరుణాలు, వాయిదా పద్ధతులు ఈ ధోరణికి ఆజ్యం పోస్తున్నాయి.

నిజానికి గత పదేండ్లుగా మధ్యతరగతి ఆదాయాలు ఎదుగూబొదుగూ లేకుండా ఏడాదికి పదిన్నర లక్షల రూపాయల వద్ద కదలకుండా ఉండిపోయినట్టు ఇన్‌కమ్‌ట్యాక్స్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇక ద్రవ్యోల్బణం ప్రకారం చూస్తే ఆదాయాలు సగానికి పడిపోయాయని చెప్పవచ్చు. అంటే ఆదాయాలు పెరగకున్నా ఆకాంక్షలు పెరుగుతున్నాయి. ఈ విపరీత ధోరణి వల్ల అప్పులు గుట్టలుగా పెరుగుతున్నాయి. పొదుపు కొంత ఎదుగుదల సాధించినట్టు కనబడుతున్నా అప్పుల ముందు అది దిగదుడుపే అవుతున్నది. కుటుంబ రుణాల స్థాయి పెరుగుదల పట్ల ఆర్బీఐ కూడా ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. జీడీపీలో ఈ కుటుంబ రుణాల వాటా 41 శాతం దాటేసింది. ఇందులో సింహభాగం, అంటే దాదాపు మూడో వంతు గృహరుణాలే. గృహేతర రుణాల వాటా కూడా భారీగా పెరుగుతుండటం గమనార్హం. ఇందులో విహారయాత్రలూ వచ్చిచేరాయి. కానీ, ఇప్పుడు ఈఎంఐల పుణ్యమా అని నచ్చిన దేశానికి వెళ్లి వస్తున్నారు.

ఒక వస్తువు అమ్మకపు ధర కన్నా దాని ఉపయోగ విలువకే ప్రాధాన్యమిచ్చే తత్వం మధ్యతరగతిలో పెరుగుతున్నది. తాహతు కన్నా సౌకర్యం, సౌలభ్యాలకే పెద్దపీట వేస్తున్నారు. విలాస వస్తువులు సంపన్నులకే అనేది పాత మాట. ఇప్పుడంతా అప్పుచేసి పప్పుకూడు విధానమే రాజ్యమేలుతున్నది. ఈ జిలుగువెలుగుల కింద సమస్యల నీడలూ, ఉద్రిక్తతల జాడలూ గోచరిస్తున్నాయి. అభిలాషలు, ఆదాయాల మధ్య వ్యత్యాసాలు, పెరుగుతున్న అప్పులతో సతమతం అవుతుండటమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పాలి. ఇంకోవైపు కృత్రిమమేధ (ఏఐ) వల్ల ఆదాయానికి ఆధారభూతమైన ఉద్యోగాలు సమస్యల్లో పడుతున్నాయి. అనేక కంపెనీలు కోతలు పెడుతున్నట్టు రోజువారీగా వార్తలు వెలువడుతూనే ఉన్నాయి. నూతన సాంకేతిక యుగంలో చదువుల ప్రాసంగికత తగ్గిపోతున్నది. ఈ హెచ్చరికలను సకాలంలో గమనించి, నూతన ప్రావీణ్యాలను సంతరించుకోకపోతే మధ్యతరగతికి మరిన్ని సమస్యలు తప్పవు.

ఎమర్జెన్సీని తలపిస్తున్న నేటి పాలన

నాంచారయ్య మెరుగుమాల

భారత్‌లో చీకటి రాజ్యానికి దారులుపరిచిన ఎమర్జెన్సీ ప్రకటనకు ఈ జూన్ 25తో 50 ఏండ్లు నిండనున్నాయి. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తన తొమ్మిదేండ్ల పాలన (1966-75) తర్వాత దేశంలో ఎమర్జెన్సీ విధించారు. 19 నెలల అత్యయిక స్థితిలో ప్రజాస్వామ్యానికి జరిగిన కీడు, జనంపై జులుం ఫలితంగా దేశ ప్రజలు పదకొండేండ్ల ఇందిరమ్మ పాలనకు 1977 మార్చి ఎన్నికల్లో ముగింపు పలికారు. ప్రస్తుత బీజేపీ ప్రధాని మోదీ పాలనకు కిందటి నెలలో 11 ఏండ్లు నిండాయి. ఐదు దశాబ్దాల క్రితం ఇందిర నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనపై ఉన్నంత తీవ్రవ్యతిరేకత ఇప్పుడు దేశంలో కనిపించకపోయినా మోదీ అన్ని రంగాల్లో తీవ్రసవాళ్లు ఎదుర్కొంటున్నారు. ఎమర్జెన్సీ విధించకుండానే అనేక ఆంక్షలు, 'చట్టబద్ధ చర్యల' ద్వారా మోదీ కూడా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రక్రియలను కొనసాగిస్తున్నారు. 'అప్రకటిత ఎమర్జెన్సీ'తో ప్రతిపక్షాలను, రాజకీయ ప్రత్యర్థులను అణచివేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

తొలి ప్రధాని నెహ్రూ కాలం నుంచి ఆయన కూతురు హయాం వరకు దేశభక్తిని సొంత ఆస్తిగా, బలమైన ఆయుధంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు మార్చుకున్నాయి. ఇప్పుడు దేశభక్తికి, 'హిందూ జాతీయవాదాని'కి ఏకైక హక్కుదారుగా వ్యవహరించే కాషాయ పక్షం బీజేపీ కూడా 'దేశ సమగ్రతను, జాతీయ ప్రయోజనాలను కాపాడే ఏకైక రాజకీయపక్షంగా మాట్లాడుతున్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1947 ఆగస్టు 15న నెహ్రూ అధికారాన్ని చేపట్టిన నాటి నుంచి ఆయన కుమార్తె ఇందిర హయాం తొలి తొమ్మిదేండ్ల కాలం వరకూ చూస్తే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన 1975 దాకా దాదాపు 28 ఏండ్లపాటు సాగింది. ఈ మూడు దశాబ్దాల్లో ప్రధానంగా ఇందిర మొదటి తొమ్మిదేండ్ల పాలనలోని వైఫల్యాలు, మరీ ముఖ్యంగా 1971 నుంచి సాగిన ఏకపక్ష నియంతృత్వ పాలన భారత ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకోవడానికి దారితీసింది. జనంలో అప్పటి దాకా గూడుకట్టుకున్న అసంతృప్తి బద్దలయ్యే స్థితికి చేరుకుంది. ఈ పరిస్థితుల్లో 1971లో యూపీలోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు ఇందిరమ్మ ఎన్నిక చెల్లదని 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆమెను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఈ తీర్పుపై ప్రధాని వేసిన అప్పీలును విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు వెకేషన్ జడ్జీ వీఆర్ కృష్ణయ్యర్ దాని అమలుపై స్టే విధించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సిద్ధార్థశంకర్ రే వంటి న్యాయ నిపుణులు, సన్నిహితుల సలహాతో దేశంలో ఆమె ఎమర్జెన్సీ విధించారు.

> కాంగ్రెస్ కేంద్ర క్యాబినెట్ పంపిన ఎమర్జెన్సీ విధింపు తీర్మానంపై 1975 జూన్ 25 అర్ధరాత్రి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ సంతకం పెట్టే సమయానికే దేశంలో లక్ష మందికి పైగా విపక్ష నేతలను కాంగ్రెస్ ప్రభుత్వాలు జైళ్లలోకి పంపించేశాయి. పత్రికల గొంతు నులిమే ప్రెస్ సెన్సార్షిప్ నిబంధనలు కఠినంగా అమలు చేశాయి.

1967 లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ స్వల్ప మెజారిటీతో విజయం సాధించింది. 1969లో కాంగ్రెస్ చీలిక తర్వాత జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి పేదల అనుకూల ప్రగతిశీల చర్యలతో మంచి పేరు తెచ్చుకుంది. దీంతో ఇందిర నాయకత్వంలోని కాంగ్రెస్ 1971 ముందస్తు సాధారణ ఎన్నికల్లో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. ఆ ఏడాది చివర్లో వచ్చిన బంగ్లాదేశ్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత సేనల ఘనవిజయం ఇందిరమ్మ ఖ్యాతిని నలుదిశలా వ్యాప్తిచేసింది. ఈ గెలుపుతో 1972 ఆరంభంలో ఏపీ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయాలు సాధించింది. ఆ తర్వాత ఇందిర పతనానికి నాంది పలికింది.

రాయ్‌బరేలీ నుంచి పార్లమెంటుకు ఇందిర ఎన్నికపై అలహాబాద్ హైకోర్టు తీర్పు నాటి ప్రధానిని ఎమర్జెన్సీ వైపునకు నడిపించింది. అయితే, మార్చి 24న పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయని అప్పటి ప్రధాని ప్రకటించి దేశ ప్రజలను ఆశ్చర్యచకితులను చేశారు. ఎమర్జెన్సీ కారణంగా సర్వశక్తులూ కోల్పోయిన ఐబీ వంటి ప్రభుత్వ సంస్థలు ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ గెలుస్తుందని ఇచ్చిన తప్పుడు సమాచారం కూడా ఎన్నికల ప్రకటనకు కారణమని చెబుతారు. అయితే, ఎమర్జెన్సీ ప్రకటించాక పాశ్చాత్య దేశాల్లో నెహ్రూ కూతురిగా తన ఇమేజ్‌కు అంటిన మరకలతో ఆమె భయపడటం కూడా ఎన్నికల ప్రకటనకు ప్రధాన కారణమని ఆమె సన్నిహితులు కొందరు అభిప్రాయపడ్డారు. ఎమర్జెన్సీ దాష్టీకాల అనంతరం జరిగిన ఆరో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తొలిసారి పరాజయం పాలైంది. ఇందిర సైతం రాయ్‌బరేలీలో ఓడిపోవడం విశేషం. తొలిసారి అమేఠీ నుంచి పోటీచేసిన ఆమె చిన్న కొడుకు సంజయ్‌గాంధీ కూడా పరాజయం పాలయ్యారు.

> 'దేశంలోని ప్రతి సంస్థను కుదేలుచేసి, భయోత్పాతం సృష్టించే వాతావరణం రాజ్యమేలిన చీకటి రోజుల కాలంగా అత్యవసర పరిస్థితిని భారత ప్రజలు గుర్తుంచుకుంటారు' అని ప్రధాని అయ్యాక ఎమర్జెన్సీ 43వ వార్షికోత్సవం సందర్భంగా 2018 జూన్ 26న మోదీ ట్విటర్‌లో స్పందించారు. అయితే, మోదీ సైతం ఆమె నియంతృత్వ పోకడలనే అనుసరిస్తూ చెడ్డ పేరు మూటగట్టుకుంటున్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై ప్రజాస్వామిక పద్ధతిలో వ్యాఖ్యానించిన అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్ వంటి పలువురు మేధావులపై అక్రమంగా కేసులు పెట్టి జైలుపాల్జేసే ప్రయత్నాలను బీజేపీ ప్రభుత్వాలు చేశాయి. అసలు అత్యయిక స్థితి పెట్టకుండానే ఎమర్జెన్సీ నాటి దమననీతిని బీజేపీ పాలకులు అమలు చేస్తున్నారు. ఏటా ఎమర్జెన్సీ అకృత్యాలు, దారుణాలు గుర్తుచేస్తూ జూన్ చివరి వారంలో దేశ ప్రజలకు సందేశాలు పంపించే మోదీ జాతీయ, ప్రాంతీయ పక్షాలని చూడకుండా అన్ని పార్టీల రాష్ట్ర సర్కార్లను వేధించే విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాలపై శాంతియుత పోరాటం చేసే ప్రతిపక్షాల హక్కులను మోదీ ప్రభుత్వం, బీజేపీ నాయకులు హరిస్తున్నారు. ఎలాంటి సెన్సార్షిప్ నిబంధనలు లేకుండానే టీవీ, పత్రికలు, డిజిటల్ మీడియా బీజేపీ సర్కారుకు అనుకులంగా వార్తలను వండి వార్చుతున్నాయనే భావన ప్రజల్లో బలపడుతున్నది.

1952 తొలి సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చాక నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలనపై పూర్తి ఆధిపత్యం సంపాదించాయి. దేశభక్తి ఉన్న ఎవరైనా కాంగ్రెస్ సర్కార్లకు మద్దతు పలకాల్సిందేననే తీరులో కాంగ్రెస్ నేతలు వ్యవహరించారు. 1957 అసెంబ్లీ ఎన్నికల్లో కేరళలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో ఏర్పడిన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ప్రధాని నెహ్రూ, కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో ఉన్న ఆయన కూతురు ఇందిరాగాంధీ కలిసి మత, కులతత్వ శక్తుల సాయంతో కూలదోసే వరకూ నిద్రపోలేదు. దేశవ్యాప్తంగా అన్ని పాలనా వ్యవస్థలనూ కాంగ్రెస్ అదుపులోకి తీసుకొచ్చారు. ఎన్నికల కమిషన్‌ను సైతం తమ చెప్పుచేతుల్లో నడుచుకునేలా వ్యవహరించారు. ఇందిర, ఆమె కుమారుడు రాజీవ్‌గాంధీ హస్తినలో అధికారంలో ఉండగా తమను వ్యతిరేకించిన ప్రతిపక్షాలను దేశద్రోహులుగా, జాతి ప్రయోజనాలు కోరుకోని స్వార్థపరులుగా చిత్రీకరించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వాల అవలక్షణాలు, పోకడలు ఇప్పుడు మోదీ నాయకత్వంలోని బీజేపీ సర్కారులో కనిపిస్తున్నాయి. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ రాజ్యమేలుతున్నది. దేశం చీకటి రాజ్యం దిశగా పయనిస్తున్నది.

భారత రాజ్యాంగం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఇందిర ఉక్కు పిడికిలిలో బందీ కావడానికి దోహదం చేసిన నాటి ఎమర్జెన్సీ, తదనంతర ఎన్నికల ఓటమి నుంచి కాంగ్రెస్ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదనే చెప్పాలి.

> నేడు దేశంలో మూడు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న హస్తం పార్టీ వాటిని కాపాడుకునే పరిస్థితిలో లేదు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని విస్మరిస్తూ, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాలరాసే నాటి ఇందిర పాలనను ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తుచేస్తూనే ఉన్నాయి. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనే.

ఇచ్చిన హామీలను, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి అక్రమ అరెస్టుల పర్వాన్ని కొనసాగిస్తున్నది. ఆఖరికి రైతన్ననూ సంకెళ్లతో బంధిస్తూ, నాటి ఇందిర పాలనకు తామేమీ తీసిపోమని నిరూపిస్తున్నది. ఎమర్జెన్సీకి 50 ఏండ్లు నిండుతున్న ఈ సందర్భంలోనైనా తన తీరును మార్చుకోకపోతే, ఇందిర ప్రభుత్వానికి పట్టిన గతే రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు పట్టడం ఖాయం.

> 'ఇందిరమ్మ రాజ్యం' అంటూ ప్రచారం చేసుకొని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను ఉసిగొల్పడం, రైతుల చేతులకు బేడీలు వేయడం, కార్పొరేట్లకు కొమ్ముకాసేందుకు పేద రైతుల భూములు లాక్కోవడం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం వంటి పోకడలకు పోతూ ఎమర్జెన్సీని తలపిస్తున్నది.

హార్ముజ్ మూతపడితే ధరలకు రెక్కలు!

డాక్టర్ రామకృష్ణ బండారు
79057 51940

గడిచిన దశాబ్ద కాలంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఇటీవల ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవించిన భారతదేశానికి ప్రస్తుతం ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల పెను ప్రమాదం పొంచి ఉన్నది. కరోనా వంటి గడ్డు పరిస్థితిని సైతం దాటుకొని సాగుతున్న భారత ఆర్థిక వ్యవస్థ పురోగమనంపై పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణలు తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, ప్రపంచశక్తిగా ఎదుగుతున్న మన దేశ ఆర్థికవ్యవస్థపై ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధప్రభావం ఎంతవరకు ఉంటుంది? ఏయే రంగాలపై దీని ప్రభావం పడనున్నది? వ్యాపార, వాణిజ్య ద్వైపాక్షిక సంబంధాలపై ఎటువంటి ప్రభావం పడబోతున్నది? వంటివి ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్నలు.

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం మొదటగా ముడిచమురు రంగం మీద పడనున్నది. మన దేశం చమురు అవసరాల్లో సుమారు 80 శాతం దిగుమతులే. మొత్తం చమురు దిగుమతుల్లో 46 శాతం, 70 శాతం ఎల్పీజీ పశ్చిమాసియా నుంచే భారత్ దిగుమతి చేసుకుంటున్నది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగితే, రానున్న రోజుల్లో ముడిచమురు ధరలు భారీగా పెరిగే ఆస్కారం ఉంది. అంతేకాదు, ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం ఇరాన్ ఆధీనంలోని 'హార్ముజ్' జలసంధి మార్గంలో జరుగుతున్నది. యుద్ధం వల్ల ఇరాన్ ఈ జలసంధిని మూసేస్తే ముడిచమురు ధరలు సుమారు 120 డాలర్ల నుంచి 130 డాలర్లకు పెరగవచ్చని అంచనా. అయితే, అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడం లేదు. కానీ, ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి భారత్ దిగుమతి చేసుకునే చమురు హార్ముజ్ జలసంధి గుండా వస్తున్నది. ఈ జలసంధి మూతపడితే ముడిచమురు ధరలకు రెక్కలు వచ్చినట్టే. గణాంకాల ప్రకారం.. ఒక బ్యారెల్ ముడిచమురు ధర 10 డాలర్లు పెరిగితే, మన దేశ జీడీపీ వృద్ధి సుమారు 0.3 పాయింట్లు తగ్గుతుంది. అలాగే, ద్రవ్యోల్బణం 0.4 శాతం పెరుగుతుంది.

> ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా, డిమాండుకు సరిపడా చమురు సరఫరా పడిపోవడం, అంతర్జాతీయంగా ధరలు పెరగడం ఒక సమస్య కాగా, డాలర్‌తో పోలిస్తే మన రూపాయి విలువ పడిపోవడం మరొక సమస్య. ఫలితంగా దేశీయ చమురు కంపెనీల దిగుమతి వ్యయం పెరుగుతుంది. తద్వారా, కరెంటు అకౌంట్ లోటు కూడా పెరిగే ప్రమాదం ఉన్నది. ముడిచమురుతో పరోక్షంగా సంబంధమున్న ప్లాస్టిక్, ప్రత్యేక రసాయనాలు, రంగులు, టైర్లు, ఇతర రంగాలు కుదేలవుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అది సామాన్యుడి జీవనాన్ని అతలాకుతలం చేస్తుంది.

చమురుపైనే కాకుండా, మనదేశ ఎగుమతి, దిగుమతి వాణిజ్యంపై కూడా ఇరాన్-ఇజ్రాయెల్ ప్రభావం పడుతుంది. అరేబియా ద్వీపానికి అవతల ఉన్న యెమెన్‌లోని హౌతీలు ఇరాన్‌కు మద్దతుగా ఎర్రసముద్రం, సూయజ్ కాలువను మూసివేస్తే భారత నౌకలు మన ఎగుమతి దిగుమతులకు 'కేప్ ఆఫ్ గుడ్‌హోప్' మార్గం ఎంచుకోవడం ద్వారా ప్రయాణ సమయం 15 నుంచి 20 రోజులకు చేరుకుంటుంది. తద్వారా ఒక్కో కంటైనర్‌కు సుమారు 500 నుంచి 1000 డాలర్ల వరకు ఖర్చు పెరుగుతుంది. ఫలితంగా ఎగుమతి, దిగుమతి వర్తక వ్యయం సుమారు 50 శాతం పెరగవచ్చు. ముఖ్యంగా ఎల్పీజీ, ఎరువుల ధరలు పెరగడం ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థపై ప్రభావం పడుతుంది.

భారత్‌కు ఇరాన్-ఇజ్రాయెల్ దేశాలతో సుమారు 5 బిలియన్ డాలర్ల వ్యాపార సంబంధాలున్నాయి. ఇరుదేశాలకు భారత్ వివిధ రకాల వస్తువుల ఎగుమతితో పాటు దిగుమతి కూడా చేసుకుంటున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇజ్రాయెల్‌కు భారత్ ఎగుమతుల విలువ సుమారు 4.5 బిలియన్ డాలర్లు కాగా, దిగుమతుల విలువ 2 బిలియన్ డాలర్లు. అలాగే, 2024-25లో 2.1 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 1.6 డాలర్ల దిగుమతులు ఇరుదేశాల మధ్య జరిగాయి. ఇజ్రాయెల్‌కు భారత్ ఆసియాలోనే రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇక ఇరాన్‌తో కూడా మన దేశానికి మంచి వాణిజ్య సంబంధాలే ఉన్నాయి. 2023-24లో 1.4 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 0.62 బిలియన్ డాలర్ల దిగుమతులు, 2024-25లో 1.4 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 0.44 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగాయి. భారత్ నుంచి బాస్మతీ బియ్యాన్ని ఎక్కువగా కొనుగోలు చేసే దేశాలలో సౌదీ అరేబియా, ఇరాక్, ఇరాన్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మొత్తం మన దేశ బాస్మతీ బియ్యం ఎగుమతుల్లో ఇరాన్ వాటా సుమారు 12.6 శాతం.

ఈ ఘర్షణల ప్రభావం విమానయాన రంగంపై కూడా పడుతుంది. పరిస్థితి ఇలాగే ఉంటే పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం, వెండి వంటి లోహాల వైపు మళ్లిస్తారు. తద్వారా షేర్ విలువలు పడిపోయి, షేర్ మార్కెట్ కుప్పకూలుతుంది. బంగారం, వెండి వంటి లోహాల విలువ పెరుగుతుంది. కరోనా మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ దేశాల యుద్ధప్రభావాలను తట్టుకొని ఆర్థిక స్థిరత్వం సాధిస్తున్న భారత్‌కు ఇప్పుడు ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం రానున్న రోజుల్లో పెనుముప్పు కానుంది. అయితే ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల వల్ల ఎదురవుతున్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్న భారత ప్రభుత్వం ఎటువంటి చర్యలకు ఉపక్రమిస్తుందో వేచిచూడాలి.

(వ్యాసకర్త: అసిస్టెంట్ ప్రొఫెసర్ కామర్స్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ)

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశగా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని దేశంలోని పాలకులు గప్పాలు కొడుతుంటారు. కానీ, ఆచరణకు వచ్చేసరికి వారి మాటలు నీటి మీద రాతలుగా మారుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఏడున్నర దశాబ్దాలు దాటినా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటమే అందుకు నిదర్శనం.

పంచాయతీలపై ప్రతీకారం

సభావట్ కళ్యాణ్
90143 22572

గ్రామ పంచాయతీల పటిష్ఠతే తమ ధ్యేయమని పాలకులు పదే పదే ప్రకటనలు గుప్పిస్తుంటారు. స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వాగ్దానాలు చేస్తుంటారు. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఒక వ్యూహం ప్రకారం గ్రామ సర్పంచ్‌ల ప్రాధాన్యాన్ని తగ్గిస్తున్నారు. అధికారం లేని ఉత్సవ విగ్రహాలుగా సర్పంచ్‌లను మార్చేందుకు తమవంతు కృషిచేస్తూనే ఉన్నారు. అందుకే ఒకనాడు సర్పంచ్‌లకు ఉన్న ప్రాధాన్యం నేడు కానరావడం లేదు.

> నిబంధనల మేరకు ఐదేండ్లకోసారి జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఏదో ఒక కారణం చెప్పూ పాలకులు వాయిదాల మీద వాయిదాలు వేస్తూనే ఉన్నారు. ఇంచార్జీలతో స్థానిక సంస్థలను నడిపేందుకే మొగ్గు చూపిస్తున్నారు. మరోపక్క గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలు పెట్టి సర్పంచులను పక్కనపెడుతున్నారు. వారి ప్రమేయం లేకుండా, వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితులను తీసుకువచ్చారు. విద్యాకమిటీలు, ఆస్పత్రి కమిటీలు, నీటి సంఘాలు, వనరక్షణ సమితులు.. ఒక్కటేమిటి గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రతినిధులకు సమాంతరంగా అనేక పదవులను సృష్టించారు.

నేతల వాగ్దానాలతో ఏదో సాధించాలని, సమాజానికి ఏదో ఒకటి చేయాలని తపనతో ఎందరో యువకులు వ్యయప్రయాసలకోర్చి సర్పంచులయ్యారు. ఈ చట్టాల వలన, అధికారుల మాయాజాలంలో తాము ఏమీ చేయలేమనే విషయం అర్థంకావడానికి వారికి చాలా కాలం పట్టింది. అయినా తాము చేసిన వాగ్దానాలను నెరవేర్చుకునేందుకు తల తాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి అభివృద్ధి పనులు చేశారు. కానీ, వాటి బిల్లులు ఎంతకూ రావడం లేదు. ఆఫీసుల చుట్టూ తిరిగి వారు అలసిపోయారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి సమాజంలో తతెత్తుకొని తిరగలేక ఇప్పటికే డజన్ మందికి పైగా సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మిగిలిన వారూ పడుతున్న వేదన అంతా ఇంతా కాదు.

గతేడాది జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగిసింది. ఆ తర్వాత ఫిబ్రవరిలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఆగమేఘాల మీద వారివద్ద నుంచి రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నది. కానీ, బిల్లులు మాత్రం చెల్లించలేదు. వస్తాయో రావో తెలియదు. ఎప్పుడొస్తాయో చెప్పేవారు లేరు. మరొకపక్క ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు అందడం లేదు. దీంతో గ్రామాల్లో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే ఎంతో గౌరవమర్యాదలు ఉండేవి. భారతదేశంలో స్థానిక సంస్థలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. చంద్రగుప్తుడి కంటే ముందు నుంచే గ్రామవ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. గ్రామసభల నిర్ణయాలకు నాటి రాజరికపు వ్యవస్థ ఎంతో ప్రాధాన్యం ఇచ్చేది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థలకు స్వయంప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామ స్వరాజ్యం లక్ష్యంలో స్థానిక సంస్థల పటిష్ఠత ప్రధానమైనది. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952 నుంచి పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు చేశారు. కానీ, సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలకులకు మనసొప్పడం లేదు.

ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాదివంటిది. అందులో సర్పంచులు చాలా కీలకం. రాష్ట్రానికి మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు కేకలు పెడుతున్న నాయకులు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడం దురదృష్టకరం. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తి అంటూ పదేపదే నీతులు వల్లె వేసే పాలకులు రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా